క్లుప్తంగా

కూరగాయల మార్కెట్ సందర్శన



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి

సుల్తానాబాద్: పట్టణంలో ఉన్న కూరగాయల మార్కెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి శనివారం పరిశీలించారు. పాడైన కూరగాయలను మార్కెట్ పక్కన పడేయొద్దని సూచించారు. చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకోవాలని, అందులోనే కుళ్లిపోయిన కూరగాయలు వేయాలని కోరారు. తద్వారా మార్కెట్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటాయని, రోజూ చెల్లించే తైబజార్ రుసుం రూ.10 మాత్రమే చెల్లించాలని వర్తక వ్యాపారులకు సూచించారు. అనంతరం 8వ వార్డు మార్కండేయ కాలనీలో ప్రత్యేక పారిశుధ్య పనులను వార్డ్ కౌన్సిలర్ చింతల సునీతతో కలిసి పరిశీలించి డ్రైనేజీలో సిల్ట్‌ను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు కూకట్ల గోపి, రాజన్న, నాయకులు గాజుల రాజమల్లు, చింతల రాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



సన్మానిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు హార్టికల్చర్ విభాగంలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న కార్మికులను ఘనంగా సన్మానించారు. శనివారం ప్లాంట్‌లోని హార్టికల్చర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న అంజమ్మ, రంగమ్మ ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా ఐఎఫ్‌టీయూ నాయకులు చిలుక శంకర్ సన్మానించారు. మల్లయ్య, ఐలయ్య, పర్వతాలు, భూమయ్యలతో పాటు పలువురు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

సమావేశం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఉద్యమకారులు

రామగిరి: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించే తెలంగాణ పునర్నిర్మాణ కార్యచరణ సమావేశాన్ని ఉద్యమకారులు విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ కోరారు. శనివారం సెంటనరీకాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ముఖ్య కార్యకర్తలు హాజరుకావలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మంత్రి శ్రీధర్ బాబును మేనిఫెస్టో చైర్మన్‌గా నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం, కార్యదర్శి కళాధర్ రెడ్డి, జిల్లా పార్లమెంట్ కన్వీనర్ బత్తుల శంకర్, ఉద్యమకారులు ప్రతాప్‌రెడ్డి, నాగుల కృష్ణ, రాజేశ్వరరావు, రవీందర్‌రెడ్డి, సదాశివ్ పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామంలో ప్రతిష్ఠించే ఉత్సవ విగ్రహాలను శనివారం భక్తులు ఊరేగించారు. ఆదివారం నుంచి గ్రామంలో భూదేవి, శ్రీదేవి సహిత (బొడ్రాయి) విగ్రహాల ప్రతిష్ఠాపనతో పాటు పోచమ్మ కొలుపు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవ విగ్రహాలను వాహనంలో ఊరేగిస్తుండంతో మహిళలు కోలాటాలతో అలరించారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లో అర్హులైన యువత నూతన ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ స్వర్ణ తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 18ఏళ్లు నిండిన వారు 15వ తేదీనాటికి నూతన ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ స్వర్ణ కోరారు.

ప్రమాదకరంగా కెనాల్ కల్వర్టులు

- అధికారుల పర్యవేక్షణ కరువు
- పొంచి ఉన్న ప్రమాదం
- నూతన కల్వర్టులు నిర్మించాలని డిమాండ్



రొంపికుంటకు వెళ్లేదారిలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు



గుండారం రిజర్వాయర్‌కు వెళ్లే దారిలో శిథిలావస్థలో ఉన్న కల్వర్టు

కమాన్‌పూర్: మండల పరిధిలోని ఎస్సారెస్పీ కాలువలపై నిర్మించిన పురాతన కల్వర్టులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. పెద్దపల్లి మండలం రంగాపూర్, సబ్బితం గ్రామాల సమీపంలోని డి-83 కెనాల్ నుంచి కమాన్‌పూర్ మండలానికి సాగునీరు అందించే ఎల్-36, ఎల్-37 ఉప కాలువలపై సుమారు 40ఏళ్ల క్రితం నిర్మించిన కల్వర్టులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. కల్వర్టుల కింది భాగంలో పూర్తిగా బండరాళ్లు కూలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. కల్వర్టులపై నుంచి భారీ వాహనాలు వెళ్తే కూలిపోయే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు..

ఎస్సారెస్పీ కెనాల్స్‌పై కట్టిన నిర్మాణాలు పూర్తిగా శిథిలావస్థకు చేరినా సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతుకు నోచుకోవడం లేదు

కెనాల్స్‌పై ఉన్న రహదారులు బీటీ, సీసీరోడ్లుగా మారుతున్నప్పటికీ కల్వర్టులకు మరమ్మతుకు మోక్షం లభించడం లేదు. రహదారుల నిర్మాణం చేపట్టిన సదరు కాంట్రాక్టర్లు తమకు కల్వర్టులతో సంబంధం లేదని, వాటి మరమ్మతు బాధ్యత ఎస్సారెస్పీ అధికారులదేనని అంటున్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ: దుకాణాలలో తగినంత స్థలం ఉన్నా, రోడ్డు, ఫుట్‌పాత్ ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించవద్దని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ కోరారు. శనివారం కార్యాలయంలో నిర్వహించిన టౌన్ వెండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. మేడిపల్లి సెంటర్ గ్రీన్ బెల్ట్‌లో ఆక్రమణలు తొలగిస్తున్న నేపథ్యంలో చిరువ్యాపారులు ఉపాధి కోల్పోకుండా, ప్రత్యామ్నాయంగా ఎన్టీపీసీ వారసంత స్థలంలో వ్యాపారాలు నిర్వహించుకోవచ్చని తెలిపారు. చిరు వ్యాపారుల సౌకర్యార్థం ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని పార్కింగ్ స్థలాన్ని ఉపయోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గోదావరిఖని ఏసీపీ ఎం.రమేశ్ మాట్లాడుతూ, రోడ్లు విశాలంగా ఉంటేనే చిరువ్యాపారుల వద్ద వినియోగదారులు కొంత సేపు ఆగి కొనుగోళ్లు చేయగలుగుతారని, దీంతో వ్యాపారాలు కూడా మెరుగుపడతాయన్నారు. ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, సర్వీస్ రోడ్డు ఉపయోగంలోకి తీసుకురావడానికి అందరూ సహకరించాలని కోరారు. మెప్మా డీఎంసీ రజనీ వీధి వ్యాపారుల సంక్షేమం కోసం మెప్మా చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, ఐసీడీఎస్, సీడీపీవో స్వరూప, జీజీహెచ్ ఆసుపత్రి ఆర్ఎంవో అప్పారావు, సూపరింటెండెంట్ మనోహర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా లావణ్య



యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా రామగిరి మండలం ముస్త్యాల మాజీ సర్పంచ్ లావణ్యను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షురాలు కొలిపాక సుజాత పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు.

కాంట్రాక్టు కార్మికుల పనివేళలు మార్చండి

గోదావరిఖని: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పనివేళలు మార్చాలని ఏఐటీయూసీ నాయకులు ఎంఏగౌస్, శనిగల శ్రీనివాస్ కోరారు. శనివారం ఆర్జీ-1 సివిల్ ఎస్ఈ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పనివేళలు ఉండాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులు ఎండల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని వారు కోరారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ప్రస్తుతం ఉన్న ఎండల తీవ్రతతో డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉందన్నారు.

మహనీయుల జయంతి ఘనంగా నిర్వహించాలి

గోదావరిఖనిటౌన్: మహనీయులైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరుతూ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు వినతిపత్రం అందజేశారు. జయంతి ఉత్సవాలను ప్రభుత్వపరంగా ఘనంగా నిర్వహించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, సంఘం నాయకులు పులి మోహన్, మంతెన లింగయ్య, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, పెద్దెల్లి తేజస్విని ప్రకాష్, నాయకులు బొమ్మక రాజేశ్, ఇరుగురాల కృష్ణయ్య, దుబాసి బొందయ్య, బూడిద మహేందర్, గొర్రె నర్సింగరావు, బొంకూరి పవన్ కుమార్, కోల కనకయ్య, సదానందం పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన అధికారికి సన్మానం



సన్మానిస్తున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధిలోని సివిల్ విభాగంలో పనిచేసే క్వాలిటీ ఇంజినీర్ పొట్లూరి శ్రీనివాస్‌రావు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా శనివారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాస్‌రావుకు జీఎం చింతల శ్రీనివాస్ జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ, సివిల్ ఏజీఎం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మహనీయుల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కోల్‌సిటీ: ఏప్రిల్‌లో జరగనున్న డాక్టర్ బాబుజగ్జీవన్‌రాం, జ్యోతిరావుపూలే, అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని దళిత సంఘాల నాయకులు కోరారు. శనివారం మేయర్ బంగి అనిల్‌కుమార్, కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఎల్లయ్య, వెంకట్, రవికుమార్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, కనకయ్య, మాదిగ, అనిల్‌కుమార్, రాంబాబు, రామలింగయ్య, సంపత్ పాల్గొన్నారు.

నంది ప్రతిభా పురస్కారానికి ఎంపిక

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని సోమనపల్లి గ్రామ పంచాయతీ కారోబార్, సామాజిక కార్యకర్త, రాజేశ్వరి సేవా ట్రస్ట్ చైర్మన్ కత్తెరమల్ల రాజలింగం నంది ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఏప్రిల్ ఒకటో తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో అవార్డు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఇసుక లారీ సీజ్

మంథని: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. శనివారం మంథని-పెద్దపల్లి రహదారి కూచిరాజ్‌పల్లి శివారులో లారీని ఆపి తనిఖీలు చేయగా, ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు తేలింది. డ్రైవర్‌ను ప్రశ్నించగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దేవరాంపల్లికి చెందిన సయ్యద్ ముజాహిద్‌గా చెందిన వ్యక్తిగా..అలాగే తన యజమాని ఎండీ గోరిమియాగా వివరాలు తెలిశాయి. మంథని శివారులో డంప్ యార్డు నుంచి లారీలో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

తల్లిపై కొడుకు హత్యాయత్నం

మంథని: మంథని మండలం కాకర్లపల్లికి చెందిన తీగల శాంతపై ఆమె చిన్న కొడుకు హరీశ్ కత్తితో దాడి చేసిన కేసులో శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. మద్యానికి బానిసైన హరీశ్ తల్లిని డబ్బుల కోసం తిట్టడంతోపాటు కత్తితో గాయపర్చాడు.

వలసజీవి మృతిపై కేసు

జ్యోతినగర్: ఇటీవల వలసజీవి మృతిపై ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోర్బా జిల్లాకు చెందిన కోమల్, దర్శన్‌సింగ్‌లు గురువారం క్రేన్ గ్లిడ్ శాంపిల్స్ సేకరించేందుకు రామగుండం ఎన్టీపీసీకి వచ్చారు. ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లోని లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నారు. దర్శన్‌సింగ్(24) రాత్రి సమయంలో ఫోన్ మాట్లాడుతూ నాలుగో ఫ్లోర్ నుంచి ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడడంతో తీవ్రగాయాలై మృతిచెందాడు. మృతుడి తండ్రి కరణ్‌సింగ్ ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'యూనివర్సల్'లో వీడ్కోలు సమావేశం

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల యూనివర్సల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రధానోపాధ్యాయుడు అఫ్జల్‌ఖాన్, కరస్పాండెంట్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

నేత్రదానం

ముత్తారం: మండలంలోని లక్కారానికి చెందిన బర్ల రాజక్క అనారోగ్యంతో శనివారం చనిపోయింది. మృతురాలి నేత్రాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంతో ఎల్‌వీపీ ఐ బ్యాంకు టెక్నీషియన్ ఉపేందర్ సహకారంతో నేత్రాలను సేకరించి హైదరాబాద్ ఐ బ్యాంకుకు పంపించారు. సదాశయ ఫౌండేషన్ సెంటీనరికాలనీ కన్వీనర్ ఐలి మధు మృతురాలి కుటుంబ సభ్యులు బర్ల లింగయ్య, సదానందం, కనుకమ్మకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ నిర్వాహకుడు, జాతీయ అధ్యక్షుడు టి.శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, రాష్ట్ర కార్యదర్శి భీష్మచారి, కెఎస్‌వాస్, రాజామౌళి, సమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండంలోని డివిజన్లలో పనిచేస్తున్న ఆఫ్ లోడింగ్ కంపెనీ డ్రైవర్లతో పాటు ఏఐటీయూసీ కాంట్రాక్ట్ కార్మిక వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర తిరుపతి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను శనివారం కలిశారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుతో పాటు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే కాంట్రాక్ట్ కార్మికులు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేలా చూస్తామని తెలిపినట్లు బుర్ర తిరుపతి పేర్కొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

పెద్దపల్లిరూరల్: పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని డాక్టర్ మధుకర్‌రెడ్డి, జెండర్ స్పెషలిస్టు స్వప్న అన్నారు. పెద్దపల్లిలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం బేటీ పడావో.. బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా శనివారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో పాటు అభినయ్, మధుసూదన్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ ఎదుట చెత్త పోసి నిరసన

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన ఆశాడపు రవీందర్ తాను ఉండే వాడలో చెత్త పేరుకు పోయిందని పంచాయతీ ఎదుట నిరసన తెలిపాడు. కార్యదర్శి పున్నమయ్యకు ఈ విషయం తెలిపినా పట్టించుకోవడం లేదని శనివారం వాడలో ఉన్న చెత్తను పంచాయతీ కార్యాలయం ఎదుట పోసి నిరసన తెలిపాడు. ఈ విషయమై మండల పంచాయతీ అధికారి కిరణ్‌ను వివరణ కోరగా పెద్దపూర్ కార్యదర్శి పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించినందుకు జిల్లా పంచాయతీ అధికారులు ఇదివరకే సంజాయిషీ నోటీసులు ఇచ్చారని, త్వరలోనే పనులు చేయిస్తానని పేర్కొన్నారు.



రన్ ఫర్ జీసస్

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శనివారం రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని క్రైస్తవులు నిర్వహించారు. మండలంలోని హన్మంతునిపేటకు చెందిన శాంతిరాజ్ సామాజిక బాధ్యతగా రక్తదానం చేసినట్లు తెలిపారు.

వైభవంగా ఆలయాల ప్రారంభోత్సవం





నూతన దేవాలయంలో ప్రతిష్ఠ మహోత్సవాలు, పాల్గొన్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మొట్లపల్లిలో దేవాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ప్రజలు నిర్వహించారు. శ్రీఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవంతో ప్రారంభమై ఏప్రిల్ 1న ముగుస్తాయి. మూడురోజుల పాటు జరిగే ఆలయాల ప్రారంభోత్సవాల సందర్భంగా భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ బోలమల్ల కౌసల్య శంకర్, మాజీ సర్పంచులు గోనె శ్యామ్, తుల మనోహర్‌రావు, మద్దసాని స్వరూప, రాజయ్య, కోమాల మల్లమ్మ, మాజీ ఎంపీటీసీ సంగని నారాయణ, ఆలయ కమిటీ సభ్యులు దొమ్మటి రవి, జంగా ప్రభాకర్‌రెడ్డి, గాజర్ల వెంకటేశ్, దొమ్మటి భాస్కర్, గాజర్ల శ్రీనివాస్, ముద్దసాని సమ్మయ్య, అలుగువెల్లి రమణారెడ్డి, సంగని తిరుపతి, అలుగువెల్లి సంపత్‌రెడ్డి, ముదసాని రాజేశం, సంగని శ్రీనివాస్, అనుముల బుచ్చయ్య, వేద పండితులు, రాష్ట్ర దూప దీప నైవేద్య రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్‌శర్మ, మనోహర్ శర్మ పాల్గొన్నారు.

ఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తొటం సతీశ్



గోదావరిఖనిటౌన్: గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తొటం సతీశ్ ఎన్నియ్యారు. అధ్యక్ష పదవికి శనివారం రాత్రి వరకు జరిగిన ఎన్నికల్లో తొటం సతీశ్‌కు 104 ఓట్లు, సీహెచ్ శైలజకు 88 ఓట్లు వచ్చాయి. 16 ఓట్ల మెజార్టీతో సతీశ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా రాంటెంకి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి శ్రీనివాస్(ఏకగ్రీవం), జాయింట్ సెక్రటరీగా పులిపాక ప్రవీణ్‌కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా దూడపాక లింగస్వామి, లైబ్రరీ సెక్రటరీగా ఇరుగురాల మహేందర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా గుర్రం నారాయణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లుగా మాట్ల భానుకష్ణ, చిదురాల రమేశ్, ఇరుగురాల సంతోష్, ఎం.వరలక్ష్మి ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

మురుగు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

రామగుండం: పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ పైనున్న వంతెన కింది భాగంలో నిలిచిపోయిన మురుగు, వ్యర్థాలతో తరచూ నీటి సరఫరాకు అడ్డంకిగా మారి రోడ్డుపైకి డ్రైనేజీ నీరు పొంగుతోంది. దీనిపై 27న సాక్షి దినపత్రికలో 'ముంచెత్తుతున్న మురుగు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై కమిషనర్ శ్రీకాంత్ స్పందించారు. క్షేత్రస్థాయిలో డ్రైనేజీ దుస్థితిని పరిశీలించారు. ఈ క్రమంలో శనివారం వంతెన కింది భాగంలో పేరుకుపోయిన చెత్త, మురుగు, వ్యర్థాలను కంప్రెషర్ మిషన్ సాయంతో పారిశుధ్య సిబ్బంది మురుగు నీటి సరఫరాను పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యారు.



మురుగును తొలగిస్తున్న సిబ్బంది

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం



జ్ఞాపిక బహూకరిస్తున్న విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఖాజా జహీర్ అహ్మద్ 31న ఉద్యోగ విరమణ పొందుతున్న నేపథ్యంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు శనివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేశ్, అంబేద్కర్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ లెక్చరర్ సుబ్బారావు, గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్స్ గడ్డం శ్యాంకుమార్ గౌడ్, కాంపెల్లి సతీశ్, జెట్టి రాము, సుద్దాల శ్రీనివాస్, సందీప్, కిరణ్, పోయిల సాగర్, రామకృష్ణ, శివ, రాజు, లెక్చరర్స్ అజయ్, ఆంజనేయులు, నరేశ్, డాక్టర్ కిరణ్మయి, సంగీత, ఉష, శారద, రమాదేవి, శ్రీదేవి, సౌజన్య, సీనియర్ అసిస్టెంట్ మాతంగి శ్రీధర్, కోటి, కల్వల సాయిరాం, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణతో విశ్రాంత జీవితం



సంపత్‌రావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కమాన్‌పూర్: ప్రతి ఒక్క ఉద్యోగి ఉద్యోగ విరమణ తర్వాత ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో విశ్రాంత జీవితం కొనసాగించడం ప్రారంభిస్తారని పలువురు వ్యక్తులు, ఉపాధ్యాయులు అన్నారు. మండల విద్యాధికారిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న పల్లెపాటి సంపత్‌రావు వీడ్కోలు సమావేశాన్ని శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేశారు. అనంతరం సంపత్‌రావు దంపతులను సన్మానించారు.

బొడ్రాయి ప్రాణప్రతిష్ఠ



పూజల్లో ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు

రామగుండం: అబాది రామగుండంలో జరుగుతున్న బొడ్రాయి ప్రాణ ప్రతిష్ఠ వేడుకలకు శనివారం టీపీసీసీ పీసీసీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు కుటుంబసభ్యులతో హాజరయ్యారు. పూజారి రాంపెల్లి మురళీధర్‌శర్మ తదితరులు పూజలు నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు.

కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ టికెట్ మాదిగలకే ఇవ్వాలి

సుల్తానాబాద్: పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ మాదిగలకే ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ జాతీయ మాజీ కార్యదర్శి ఉట్ల వరప్రసాద్ అధిష్టాన వర్గాన్ని కోరారు. ఢిల్లీలో కాంగ్రెస్ నాయకులను కలిసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన టికెట్లు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్‌లో 23 ఏళ్లుగా పనిచేస్తున్న కార్యకర్తలను గుర్తించాల్సిన బాధ్యత అధిష్టాన వర్గాన్నికి ఉందన్నారు. మాదిగ సామాజిక వర్గానికి, స్థానికులకు అవకాశం కల్పించి, పార్టీ కోసం నిరంతరం పని చేసే వారికి టికెట్ కేటాయించాలని కోరారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కోల్‌ఇండియా తరహాలో వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ అన్నారు. శనివారం ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ డివిజన్లలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశంలో మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులు చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోల్ ఇండియాలో చెల్లిస్తున్న విధంగా కాంట్రాక్ట్ కార్మికులకు అమలు చేయాలని కోరారు. నాయకులు రాము, రవి, దేశాయినాయక్, రాజనర్సు, శేఖర్, వెంకటేశ్, లలిత, రాంబాబు, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.